
# తాకట్టులో ఆయుధం!

—బొల్లిముంత నాగేశ్వరరావు



'తలదిండి' గ్రామంలోని భద్రయ్య ఇల్లు అన్ని టికంటే ఎత్తుగా కనిపిస్తుంది. ఇంటిచుట్టూ అశోకవృక్షాలు ఇంటికంటె ఎత్తుగా పెరిగాయి. ఎత్తుగా వుండే ప్రహరీకి ఇనుప గేటు వుంది. ప్రహరీ గోడల కటూ- ఇటూ రెండు సింహాల బొమ్మలు వచ్చే జనంవంక నోర్లు తెరుచుకుని తమ వీలికళ్ళతో నిశితంగా చూస్తుంటాయి.

ఆ బొమ్మలంటే భద్రయ్య కెంతో ఇష్టం. వాటి మీద దుమ్ము పేరుకుందని గమనించగానే పనిమనిషిని ఎక్కించి శుభ్రంగా కడిగించేవాడు. కడిగిన ఆ బొమ్మల్ని బజారులో కొచ్చి తృప్తిగా చూసుకునేవాడు.

ఇంటి వరండాలో భద్రయ్య కూర్చునేందుకు ఒక ఈజీ ఛైర్, వచ్చిన జనం కూర్చునేందుకు బారుగా వుండే బల్లా ఎప్పుడూ సిద్ధంగా వుంటాయి. భద్రయ్య రోజులో అయిదారు గంటలు అక్కడే కూర్చొని వుంటాడు.

మనిషికి ముందు కొచ్చినట్టు కనిపించే పొట్టా, బుర్ర మీసాలు ప్రత్యేక లక్షణాలు. ఇంటి దగ్గర కూర్చున్నప్పుడు మాత్రం వంటి మీద ఎప్పుడూ చొక్కా వుండదు.

భద్రయ్య ఇంటి లోపలికెళ్తే ఆ ఇంటికి తగ్గ ఆధునికమైన అలంకారాలు కనపడవు. గదుల నిండా ఇత్తడి బిందెలూ, రాగి కాగులూ, బాయిలర్లూ, కడవలూ, చెంబులూ ఒక పద్ధతిలేకుండా పడి వుండేవి. వాటి మీద సిరాతో వ్రాయబడిన ఒక నెంబరు మాత్రం వుండేది. ఆ నెంబరు తాలూకు మనిషి పేరూ, ఇచ్చిన పైకమూ, తేదీ మాత్రం ఒక బారుగా వుండే పుస్తకంలో వివరంగా, గుండ్రంగా భద్రయ్య వ్రాసుకునేవాడు!

ఈ సామాన్ల భద్రత కోసమే అన్నట్టు భద్రయ్య ఇంటిని గట్టిగా కట్టించాడు. కిటికీలు పెద్దగా వుండవు. వెంటిలేటర్లు అసలు లేవు.

ఇంట్లో నడివయసుకు చేరిన భార్యా, పట్నంలో చదివే కొడుకూ, పెళ్ళై అత్తవారింటికి చేరిన కూతురు ఆయనకున్న చరాస్తులు.

పొలం కూడా కొని కొంత స్థిరాస్తిని ఏర్పాటు చెయ్యమని అటు కొడుకూ, ఇటు భార్యా ఆయన్ని అప్పుడప్పుడు అడుగుతుండేవారు. భద్రయ్య అందుకు అంగీకరించలేదు.

పొలం మీద వచ్చే రాబడి, తాకట్టు వ్యాపారం మీద వచ్చే రాబడి ప్రక్కప్రక్కన లెక్కించుకుని బేరీజు వేసుకునేవాడు.

> **నిచ్చెన**
>
> "ఆఫీసు గదిలో నిచ్చెన పెట్టుకున్నా డెందుకు?"
>
> "జీవితంలో తాను ఎన్ని మెట్లు ఎక్కాడో, ఇంకెన్ని మెట్లు మిగిలాయో చూసుకోడానికి."
>
> — చిట్టిబాబు, కొత్తగూడెం కాలరీస్

పొలం కొంటే అంతా చిక్కే ...

పొలంలో పనులు చేసే కూలీలకు కూలి ఫలుగురి[...]
పాటు ఇవ్వాలి. ఏ మాత్రం ఇరగ్గోసినా వాళ్ళు పమ్మెం[...]
నిరసనలనీ నానా గొడవా గుమ్మం ముందు చేస్తారు. [...]
కూలి ఇచ్చి పనులు చేయిస్తే... ఎకరం మీద ఏం రాబ[...]
వస్తుంది? గాలివానల్నీ, ధూళివానల్నీ తట్టుకు[...]
తెగుళ్ళనీ, నీరు అందని భూమి పగుళ్ళనీ తట్టుకు[...]
ఎరువులు, కోత, నూర్పుడి ఖర్చులన్నీ భరిస్తే... ఖర్[...]
వేలతో కొన్న ఎకరానికి ఇరవై బస్తాలు రావడం గగన[...]
పోతుంది. తీరా వచ్చాక మార్కెట్టులో గిట్టుబాటు ధ[...]
వుందా అంటే అదీ లేదు!

దళారీల దయాధిక్ష క్రింద ధాన్యం అమ్[...]
కోవాలి...

ఇరవై వేలు చేతి లో వుంటే... తాకట్టువ్యాపారంల[...]
నెలకో పంట!

అదీ ఇంటి ముంగిట్లో ఈజీ ఛైర్‌లో కూర్చుని..

పొలం కొంటే ఎండలో, వానలో, చలిలో ఎప్పుడ[...]
తిరగాల్సిందే. కూలీల్ని బ్రతిమలాడాలి...

మరిప్పుడు తను చేసే వ్యాపారంలో, అదే కూలీ[...]
పనులు దొరకని రోజుల్లో తన ముంగిట్లో కొచ్చి చేతు[...]

3-3-89

కట్టుకు నిలబడుతున్నారు.

ఈ దేశంలో కావాల్సినంత పేదరికం వుంది. తాకట్టు వ్యాపారానికి సిసలైన ముడి సరుకది!

ఏ ప్రభుత్వ మొచ్చినా దేన్నయినా మార్చుతుం దేమోగాని, దీన్ని మాత్రం మార్చలేదు.

భద్రయ్యకున్న ధీమా అది!

ప్రభుత్వాలు దివాలాతీయవచ్చు..బ్యాంకులు దివాలా తీయవచ్చు! తనుమాత్రం ఎప్పటికీ దివాలా తీయడు.

తీసినకొద్దీ పెద్ద దయ్యేది గుంటయితే..ఇచ్చినకొద్దీ పెరిగేది ఈ వ్యాపారం!

పది రూపాయిలిచ్చి ముప్పయి రూపాయిల వస్తువు తాకట్టు పెట్టుకోవచ్చు! ముప్పయి రూపాయిలిచ్చి వంద రూపాయిలు వస్తువు తాకట్టులో వుంచుకోవచ్చు!

డబ్బు తిరిగి వస్తే పది రూపాయిల వడ్డీతో వస్తువు తన దగ్గరే పెరిగి డబ్బుగా మారుతుంది.

భద్రయ్య అనేకసార్లు అనుకుని లోపల లోపల మురిసిపోయేవాడు. పొలం కొని వ్యవసాయం చెయ్యమన్న కొడుకునీ, భార్యనీ విచిత్రంగా చూసేవాడు.

తరాలు హాయిగా తాకట్టు వ్యాపారంలో బ్రతికి పోవచ్చు. ఏ వ్యాపారానికైనా ఇల్లు వదలాలి. తన వ్యాపారానికి తన ఇంటికే ఇళ్ళన్నీ కదలి వస్తాయి. ఇల్లు అంటే భద్రయ్య దృష్టిలో మనుషులూ, సామాన్లూ.. అవి రెండూ తన దగ్గరికి కదలిరావడంతో భద్రయ్యకు ఇళ్ళే తన వద్దకు కదలివచ్చినట్టుగా తోస్తుంది!

తరాల అంతరం ... తన కొడుకు ఈ వ్యాపారం పనేమిరా వద్దని వాదిస్తాడు.

వాడి ముఖం...

వాడికేం తెలుసు...

కుర్రతనం – మధ్య వయసుకు చేరితేగాని తెలీదు.


భద్రయ్య ఆలోచించుకుంటూ వరండాలో కూర్చున్నప్పుడు పరమేశుడు వట్టి చేతుల్తో వచ్చి వినయంగా నిలబడ్డాడు.

* * *

పరమేశు బక్కగా వుంటాడు. కోపమొస్తే కాస్తంత తిక్కగా వుంటాడు. పెరిగిన గడ్డం గుబురుగా కనిపిస్తుంది. ముక్కు బారుగా, స్ఫుటంగా ఆ నల్లని వెంట్రుకలలో స్పష్టంగా కనిపిస్తుంది. చొక్కా ఎప్పుడూ వెయ్యడు. అలాగని అతడు వుండీ వెయ్యడని కాదు! లేక వెయ్యకపోవడవే...! చిరిగిన చేతుల బనియనూ, క్రింద ఎప్పుడూ మట్టిగోచీ బిగించిన పంచె పరమేశు వస్త్రాలంకరణ– దారాలుగా మారి పీసు తేలిన కండువా తలకు చుడతాడు. చెవులలో సగం కాలిన బీడీలుంటాయి.

బీడీని అతడెప్పుడూ ఒకేసారి కాల్చడు. రెండు దమ్ములు పీకి ఆర్పేస్తాడు. మిగిలినదాన్ని పొడుం రాలని విధంగా కాలినవైపు పైకి మాసేట్టు చెవుకీ, తలకీ మధ్య జాగ్రత్తగా అమర్చుకుంటాడు!

ఊరుకు బయట పరమేశు ఇల్లు వుంది. అతని ఇంటి గోడలు మట్టితో కట్టినవే. ఇంటిలో మట్టి పాత్రలే ఎక్కువ! ఇటీవలే ఒక ప్లాస్టిక్ చెంబును ప్రయాసపడి కొన్నాడు. పరమేశు భార్య రమణమ్మ పేడ పోగు చేసుకొస్తుందిగానీ ఇల్లు ఎప్పుడూ అలకదు! పిడకలు చేసి ఎండబెడుతుంది. ఆ పిడకల్ని బస్తా వెలగట్టి ఊరులో అమ్ముకుంటుంది!



''నిన్ను ఉరి తీయబోతున్నాం. చివరి కోరిక ఏమైనా వుంటే చెప్పు!''

'''నన్ను ఉరితీశారు' అనే వార్తను పేపరులో చూసుకోవాల న్నదే నా చివరి కోరిక సార్'' ఖైదీ జవాబు.

పరమేశు కూడా మట్టి పనే చేస్తాడు. ఉన్నవారి చేలల్లో గడ్డపని, చెరువులూ, కాలువలూ తవ్వే పని అతని కెక్కువ ఇష్టమైన పనులు. పరమేశు తండ్రి కూడా అదే పనులు చేసేవాడు. తండ్రి మంచి సంక్రమించిన వారసత్వ ఆస్తి అతనికి పలుగూ, పారా, ఒక గొడ్డలి. అయితే, అతను ఎక్కువగా పలుగు, పారనే ఉపయోగిస్తుంటాడు.

పరమేశుకు ముగ్గురు పిల్లలు! తినే వయసులోనే వున్నారు. పనిచేసే వయసుకు రాలేదు. పరమేశు ఒక్కసారిగా వంద రూపాయిల్ని చూసింది మూడో పిల్లాడు పుట్టిన రెండో వారంలో...! ఈ ఊరి వర్సమ్మ పరమేశు భార్యను 'వ్యాన్'లో తీసుకుపోయి ఎర్ర త్రికోణం శస్త్రచికిత్స చేయించి అక్కడి అధికారులచేత వంద రూపాయిల్ని చేతిలో పెట్టించింది. అప్పుడు పరమేశుకు మూడో పిల్లాడు ముద్దుగా కనిపించాడు.

తర్వాతి నెలల్లో వాడు పాలకేడ్చేప్పుడూ, 'ఆకలనే' పదాన్ని నేర్చుకున్నప్పుడూ పరమేశు చికాకుపడ్డాడు. అప్పుడప్పుడు కొట్టేవాడు.

అలాంటి పరమేశు ఈరోజు భద్రయ్య ముందు నిలబడ్డాడు.

'ఏంటిరా ఇప్పుడొచ్చావ్?'

''ఇంటిదానికి జరం బాబుగోరూ! ఓ పది రూపాయి లియ్యండి. కట్టపడి తీరుత్తాను.''

''కష్టపడేప్పుడు ఏం తింటావ్?''

దీనికి పరమేశుకేం సమాధానం చెప్పాలో తోచ లేదు. కాసే పు తలగోక్కున్నాడు. భద్రయ్య పక పక మంటూ నవ్వాడు.

''కాత్తి తిని కాత్తి తీరుత్తా నమకోండి.''

''ఇంతకీ వట్టి చేతుల్తో వచ్చావ్!'' భద్రయ్య అన్నాడు.

భద్రయ్య ఆ మాటంటాడని పరమేశుకు తెలుసు! అయినా తన దగ్గర మిగిలి ఏం లేవు. ఒక కడవ, ఇత్తడి బిందె, చెంబు, రెండు గ్లాసులు, ఒక వంట పాత్ర ఇత్తడిదీ అన్నీ భద్రయ్య ఇంట్లోనే వున్నాయి. అసలుకు అధికమైన వడ్డీ పుట్టి, ఆ పుట్టిన వడ్డీకి మరింత వడ్డీ పుట్టి అవన్నీ ఎప్పుడో వెళ్లిపోయేయి.

కొందరికి కొన్ని విచిత్రమైన అలవాట్లుంటాయి. విచిత్రమైనా అవి సహజంగా వుంటాయి.

ఊరుకుపోయి తిరిగివచ్చే తండ్రి చేతుల్లో తిను బండారాల కోసం పసివాళ్ళు ఆశగా చూస్తారు! బల్ల క్రింద చేతులు పెట్టే భర్తగల భార్య ఆయన వస్తుంటే జేబుల వంక చూస్తుంది. దయగల తల్లి ఆలస్యంగా ఇంటికి చేరిన కొడుకు కళ్ళల్లో ఆకలిని చూస్తుంది!

వీళ్ళంతా ఒక రకమైతే ...

భద్రయ్య మరో రకం.

తన ఇంటికి ఎవరు వస్తున్నా చేతిలో ఏదైనా సామానుందేమోనని ముందుగా చూస్తాడు. దాని మూడో వంతు లేక నాలుగో వంతు ధర ఎంతో ముందుగానే మనసులో నిర్ణయించుకుంటాడు. తన వ్యాపారం 'గ్రాఫ్'లోని లాభం రేఖ ఎంత వరకు ముందుకు పోతుందో ఊహించుకుని ఉత్సాహపడతాడు.

అలా ఉత్సాహపడే భద్రయ్య పరమేశుని నిరుత్సాహంగా చూశాడు. పైపెచ్చు వాడు పది రూపాయిలు అప్పుగా యివ్వమన్నందుకు అదిరిపోయి చూశాడు.

ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు!

''ఇంట్లో ఏం సామాను లేదురా?''

''ఇంకే మున్నాయ్ భద్రయ్య గోరూ ... పలుగూ, పారా తప్ప''

భద్రయ్య కాసేపు ఆలోచించాడు. నొసలు విచిత్రంగా చిట్లించాడు. తను ఇవ్వబోయే మనీకి కాస్తంత భద్రతను కలిపి –

'సరే ... అవే పట్రా!' అన్నాడు. ఆ మాటలు విని పరమేశు కొద్దిగా ఆశ్చర్యపోయేడు. తర్వాత ఆలోచించుకున్నాడు.

ముందు పని జరగాలి. మందుబిళ్ల కొనాలన్నా చేతిలో పైసా లేదు. పిల్లలు నిన్నటి నుంచే ఆకలంటున్నారు. మట్టి పని ఇప్పట్లో దొరికేట్టు లేదు ...

మనసులో అనుకుని పరమేశు ఇంటికిపోయి పలుగు, పార భుజాన పెట్టుకుని బయలుదేరాడు. భర్త అలా బయలు దేరడంలో

'పనేదవన్నా దొరికిందా?' అంటూ అతని భార్య అడిగింది.

'దొరికింది' పరమేశు సమాధానం యిచ్చాడు. భర్త కంఠంలోని విసుగును గమనించి ఆమె పని దొరకలేదని అనుకుంది!

## 2

పరమేశుకు మేస్త్రి గోవిందు కనిపించాడు. కనిపించి మంచి కబురు చెప్పాడు —

'రేయ్ పరమేశూ ... ఐలారం చెరువు తవ్వు పని వొస్సుకొచ్చా. రేపే బయలుదేరాల – పెలి మనిషీ పలుగూ, పార, పల్లెకా ఎంట తెచ్చుకోవాల. అట్టా తెచ్చుకున్నోడికే ఆడ పనిలోకి ఒంగనిచ్చేది.'

దాంతో పరమేశు కాస్త తడబడిపడ్డాడు!

'రేపు చీకటితోటే బయలెల్లాల! పద్దికాదు మూట తెచ్చుకో ...' గోవిందని వెళ్ళిపోయేడు!

పరమేశుకు అయోమయమయింది. ఈ బ్రతుకును ముందుకు నెట్టుకెళ్ళటానికి అతని దగ్గరున్న ఆయుధం

పలుగు - పార!

పరమేశు తలగోక్కున్నాడు. అటూ ఇటూ కాస్సేపు పిచ్చిగా చూసేడు. గోవిందు పోయిన వైపుకు చూసేడు.

ఒక నెల రోజుల పని ... రెండు నెలల గ్రాసం.

ఏ రైతునవ్నా అడిగితే ... నెల రోజుల పాటు రైతుకి పలుగు పారతో పని లేకుండా ఎందుకు వుంటుంది?

చివరికి భద్రయ్యనే అడుగుదామనుకున్నాడు?

* * *

"ఈ పప్పులు నా దగ్గర సాగవ్! తాకట్టు కొచ్చిన వస్తువేదీ ద్దాని తాలూకూ డబ్బు లేకుండా ఈ గడప దాటలేదు.'

'తవరలాగంటే ఎట్ట బాబూ! అది నా సేతికొత్తే గాని నాను పని సేసే యిది లేదు. నాను పని సేత్తే గాని, తవరి గోరికి డబ్బిచ్చే యిదిలేదు' పరమేశు అంతటితో ఆగిపోయేడు.

'డబ్బిస్తే గాని వస్తు వియటానికి వీలులేదు. అందు కని డబ్బు తీసుకురా' భద్రయ్య కాస్త కోపంగానే అన్నాడు.

'డబ్బు నా కెట్టొగొస్తది' పరమేశు అడిగాడు.

'అది నాకేం తెలుసు.'

'తవరట్ట గనకండి. కాత్తి నాయం ఆలోసించండి. తవరి కియ్యాల్సిన ఆ డబ్బు కోసం నాను ఇల్లు పీక్కెళ్ళను ... నా పెళ్ళాం పిల్లలు ఈడనే వుంటారు. పని సేసుకొచ్చి నాను అడిగిన వడ్డీ యిచ్చేత్తాను. కనికర ముంచండి భద్రయ్యగోరూ!' పరమేశు ప్రాధేయ పడ్డాడు.

భద్రయ్య ఇలాంటి ఏడ్పులూ, మొత్తుకోళ్ళ విష యంలో చాలా భద్రంగానే వుంటాడు. ఒక నియమంగా వ్యవహరిస్తాడు. తను యథా ప్రకారం వ్యవహరించే కఠి నత్వంలో కనికరం అనే భావాన్ని చీమ కాలంత కూడా జొరనీయడు. అలా తను వంగి పోవటం మొదలిడితే తన వ్యాపారం క్రమంలో క్రుంగి పోతుందనేది ఆయన భయం.

'రేయ్ పరమేశూ! వ్యవహారం దగ్గరా, వ్యాపారం దగ్గరా మొహమాటం పనికిరాదు. నీకు పలుగు డబ్బు లేకుండా తిరిగి యిచ్చానని తెలిస్తే మరొకడు బయలు దేరతాడు. వాడూ ఇలాగే ఏవో కబుర్లు చెప్పి కడవో, బిందో యివ్వమంటాడు. కరిగిపోయి వాడికీ యిచ్చా ననుకో... మొదలుకు మోసం జరిగిపోతుంది! అంచేత ఎలాగయినా తిప్పలు పడి డబ్బులు తీసుకురా. పలుగు పట్టుకుపో ...' గట్టిగా చెప్పి ఆయనలోనికి పోయేడు.

పరమేశుకేం చెయ్యాలో తోచలేదు. వెనుతిరిగి బజారులోకి వచ్చాడు. పది మందికీ చెప్పుకున్నాడు. ఎవ్వరూ భద్రయ్య విషయంలో తామేం చెయ్యలే మన్నారు. ఎవరైనా డబ్బులిస్తారేమోనని తిరిగాడు. ఎవరూ చోటు పెట్టలేదు. విసిగిపోయి నిరాశగా ఇంటికి చేరాడు.

చీకటితో పని ... పలుగూ, పల్లెక లేకపోతే పని సాగని మాట నిజమే ... గోవిందు ఒక రకమైన మనిషి. కూలి కొంత ఇరగ్గోస్తాడు. పరికరాలుంటే నిండు కూలి యిస్తాడు.

ఏం చెయ్యటానికీ పాలు పోవడం లేదు. మంచం మీద పడుకుని అలాగే కాస్సేపు శూన్యంలోకి చూస్తూ



"లంచం తీసుకుని పట్టుబడి జాబు పోయిన తర్వాత అతడు ఏం చేస్తున్నాడు?"

"లంచం పుచ్చుకొన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు అనే పుస్తకం వ్రాసి మంచి డబ్బు సంపా దిస్తున్నాడు."

వుండిపోయేడు. చిరుగుల దుప్పటి - కుక్కి మంచం - కదులుతున్నప్పుడు క్రింద మరికొన్ని తాళ్ళు పెటపెట మని తెగిన చప్పుడు.

పరమేశు కిందేం పట్టటంలేదు. పలుగు, పారకావాలి తనకు. ఎలా? ఎలా? భద్రయ్య ఇవ్వడు. కానీ భద్రయ్య యివ్వాలి! ఆలోచనతో తల వేడెక్కిపోతోంది.

భార్య పెట్టిన పచ్చడి మెతుకులు యాంత్రికంగా తిన్నాడు. మళ్ళీ అదే మంచం మీద పడిపోయేడు. కడుపులో మంట! గుండెల్లో మంట — నిద్ర రావడం లేదు. బయట దూరంగా అప్పడప్పుడు మొరిగే కుక్కల అరుపులు వినిపిస్తున్నాయి. సగం చంద్రుడు కుంకి చీకట్లు కమ్ముకున్నాయి.

అర్ధరాత్రి దాటింది. ఈ పాటికి ఐలారం చెరువు పనికి కూలీలు పయనమవుతుంటారనే ఆలోచన అతని మనసులోకి వచ్చింది. అర్ధరాత్రి కునుకు కూడా అదృశ్య మయింది. పరమేశు ఇక పడుకొని వుండలేకపోయేడు. అతని మనసులోకి ఏదో ఆలోచన వచ్చింది. చెవులోంచి సగం కాలిన బీడీని తీసి నోట్లో పెట్టుకున్నాడు. అగ్గి పెట్టె కోసం వెదికాడు. పుల్లలు నిండుకున్నాయి. దీపం గుర్తుకు వచ్చింది. అదెప్పుడో ఆరిపోయింది. పరమేశు భార్య పెందలాడే దీపాన్ని కొండెక్కించి చీకటినిగుడిసె లోకి నింపుకుంటుంది. కిరోసిన్ తాము కొనలేని స్థితి ఆమెకు తెలుసు!

నోట్లో వున్న బీడీని తుపుక్కున వూశాడు.

* * *

'భద్రయ్య గోరూ' గట్టిగా బిగ్గరగా కేక.

'ఎవరు?' లోపల నుండే భద్రయ్య సమాధానం.

'నాను ... పరమేశుని ... తలుపు తీయండి!'

'—ఇప్పుడు మళ్ళీ ఎందుకొచ్చావురా?'

'తెచ్చాను'

'తెచ్చావా?' భద్రయ్య అని లోపలి నుండి బయటి వరండా లైటు వెలిగించాడు. కిటికీ గుండా పరమేశుని చూశాడు.

భద్రయ్యకు ఒక్కసారిగా భయం వేసింది. పరమేశు కళ్ళు ఎర్రగా ఉన్నాయి. భుజాన గొడ్డలి వుంది. పెద్ద గొడ్డలి. మనిషి ఏదో ఆవేశంలో వూగిపోతున్నాడు.

'ఏవిటిరా అది!' భద్రయ్య తడబడుతూ అడిగాడు.

'మరేటి లేదు - మరేదగా తలుపు తీయండి' పరమేశు బిగ్గరగా అన్నాడు.

'నేను తీను. ముందు బయటికెళ్ళు...

భద్రయ్య మాటలు పూర్తి కాలేదు. ఆయన ఇంటి తలుపు మీద గొడ్డలి దెబ్బ ఫెటేమని పడిపోయింది. భద్రయ్య గుండె గుభేలు మంది. మరో దెబ్బ ... పేళ్ళు వేసే బరువైన గొడ్డలి బలమైన దెబ్బకు తలుపు రెండుగా విచ్చుకుంది.

పరమేశులోనికి జొరబడ్డాడు. భద్రయ్య అన్ని లైట్లూ వేసి అరుస్తున్నాడు. లోనికి జొరబడ్డ పరమేశుని చూసి మరింతగా కేకలు పెట్టాడు. ఆయన భార్య కూడా అదే పనిగా శోకాలు పెట్టడం మొదలెట్టింది.

'ఆగండెహె' పరమేశు ఇళ్ళు దద్దరిల్లేట్టు గర్జించాడు. ఆ కేకతో ఇద్దరూ అదిరిపోయేరు. ఒక్కసారి వాళ్ళ నోర్లు మూతలుపడ్డాయి. నోర్లు తెరుచుకున్న వందల తాకట్టు బిందెల్లోంచి ఆ మాట ప్రతిధ్వనించి, బయటికి వచ్చింది!

నాను మిమ్మల్ని సంపటానికి రాలేదు. నా పలుగూ, పారా ఇటీయండి.'

'ఈకపోతే'

'అప్పుడుసంపి మరీ తీసుకెల్తాను

భద్రయ్య భయపడి పోయేడు.

"నాను కట్టం సేసే ఆయుదమండది. సీరాముడికి బాణం లాంటిది. ఇట్ను మూరితికి సెక్రం లాంటిది. బీమయ్య సేతులో గదలాంటిది. నేనిన్న కతల్లో ఆరంతా ఆటితోనే బతికేరు. ఆరనుకుంది సాదించేరు. ఏదన్నా తాకట్టులో వుండొచ్చుగాని ఆయుదాన్నీ, ఆలోశన్నీ తాకట్టులో వుంచకూడదండీ! ఇప్పుడు తెలిసొచ్చినాది!

భద్రయ్య గోరూ...

పేదోడు ఈ గడ్డమీన బతకాలంటే ... ఎప్పుడూ సేతులో ఆయుద ముండాల! తొందరగా నా పలుగూ, పార ఈండి' పరమేశు ఆవేశంగా అన్నాడు!

భుజాన గొడ్డలితో పరమేశు భద్రయ్యకు పరశు రాముడులా కనిపించాడు. పరుశురాముడి పని జరక్క ముందే పలుగూ, పారా ఈటం మంచిదనుకున్నాడు.

వెంటనే అవి తీసుకొచ్చి పరమేశుకిచ్చాడు.

పరమేశు వాటిని తీసుకు వెళ్ళిపోయేడు.

తను ఊహించిన తాకట్టు ఆర్థిక శాస్త్రమంతా ... ఇలా ఒక నాటికి ఏదో ఒక ఆయుధం చేతిలో జావకారి పోయే ప్రమాదాన్ని గుర్తించి భద్రయ్య నీళ్ళుకారి పోయేడు.

'ఇది వదులుకుని వ్యవసాయం చెయ్య నాన్నా' అన్న కొడుకు మాటలు జ్ఞప్తికి వచ్చాయి.

అప్పుడే తెల్లవారుతూంది! భద్రయ్య భయంగా ఊహించుకుంటూ, పగిలిన తలుపులకేసి వరండాలో కూర్చుని ఆవేదనగా చూస్తున్న సమయంలో ... ఐలారం వైపుగా, ఎర్రబడుతున్న తూర్పుకేసి పలుగు, పార భుజాన పెట్టుకుని, తట్ట నెత్తిమీద బోర్లించుకుని పరమేశు కదిలిపోతున్నాడు.

సూర్యుడు కొద్ది కొద్దిగా పైకి వస్తున్నాడు. ●